క్లుప్తంగా

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



త్వరితగతిన జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సత్యం జంక్షన్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఇరువైపుల రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. మరో పక్క గాంధీ నగర్ ప్రాంతంలోని రోడ్డును కూడా విస్తరింపజేస్తున్నారు. ముందుగా షాపు యాజమానులకు నోటీసులు అందజేసి పనులు నిర్వహిస్తున్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు



లలితానగర్ రోడ్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు నుంచి లలితాపీఠానికి వెళ్లే దారిలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. గ్రీన్‌తులసి అపార్ట్‌మెంట్ ముందున్న మ్యాన్‌హోల్ వారం రోజులుగా లీకై, మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: స్థానిక ఊర్వశికూడలిలోని న్యూటన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ నమూనాలతో అబ్బురపరిచారు. జామెట్రికల్ నగరం, చంద్రయాన్-4, ట్రాఫిక్ నియమాలు, సోలార్ విద్యుత్ తయారీ, కాలుష్యాలు, నివారణా మార్గాలు తదితర ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు ,ప్రిన్సిపాల్ మిథు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల 11 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా తరలిస్తున్న 4 కిలోల గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గంజాం జిల్లా, ఒడిశాకు చెందిన రాకేష్ మహంతి బ్యాగు తనిఖీ చేయగా అందులో 4 కిలోల గంజాయిని గుర్తించారు. రాకేష్‌ను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

రెడ్డి కంచరపాలెంలో..

మర్రిపాలెం : రెడ్డి కంచరపాలెం ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరు వ్యక్తులను మంగళవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ ఇంట్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు 7 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. వీరంతా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయిని అక్రమ రావాణా చేసి ఇక్కడ విక్రయించే క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వీరి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.



ఆర్పీపేట పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ



సామర్థ్య పరీక్ష రాస్తున్న కంచరపాలెం ఆర్పీపేట పాఠశాల విద్యార్థులు

ప్రత్యేక ప్రణాళికతో 'సిద్ధం'

- పది పరీక్షల్లో శతశాతం సాధిస్తామని ఆర్పీపేట, కప్పరాడ టెన్త్ విద్యార్థుల ధీమా
- ఉత్తమ ఫలితాల దిశగా ఉపాధ్యాయుల కృషి
- విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులకు అవగాహన తరగతులు



కప్పరాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల అనుమానాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయురాలు



కప్పరాడ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

కంచరపాలెం : పాఠశాల విద్యలో ప్రతి విద్యార్థికి టెన్త్ ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షలంటే వారిలో ఉండే భయాన్ని తొలగించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం.. ప్రభుత్వ బడులపై ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కంచరపాలెం ఆర్పీపేట, కప్పరాడ ఉన్నత పాఠశాలల్లో మార్చి 18 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్. శ్రీనివాసరావు, వి.విజయమాలిని తెలిపారు.

ఆర్పీపేట ఉన్నత పాఠశాల నుండి టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు 148 మంది. వీరిలో బాలికలు 64 మంది, బాలురు 74 మంది. కప్పరాడ ఉన్నత పాఠశాల నుండి 115 మంది పరీక్షలకు హాజరు కానుండగా.. వీరిలో బాలికలు 53, బాలురు 62 మంది ఉన్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తి కావడంతో ఉదయం , సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు అందిస్తున్నారు.

భవిష్యత్తుకు ఇదే పునాది..

భవితను నిర్దేశించే పరీక్షలు.. అందునా జీవితంలో మొదటిసారి ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు రాసిన పరీక్షలు ఒకెత్తు.. ఇవి మాత్రం ప్రత్యేకం. దీంతో కాస్త ఒత్తిడి ఉండడం సహజమే. అయితే నిత్యం తర్ఫీదు పొందుతూ ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యామంటున్నారు పలువురు టెన్త్ విద్యార్థులు. కరోనా కాలంలో చదువులు సక్రమంగా లేక పోవడంతో పునాది కాస్త మందగించడంతో వీరికి శిక్షణ ఇవ్వడం కాస్తా కష్టంగా మారినా సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సన్నద్ధం చేశామని ఉపాధ్యాయులు తెలిపారు.

పాత ప్రశ్నపత్రాలు పరిశీలించా



పాత టెన్త్ పరీక్ష పేపర్లను ఎక్కువగా పరిశీలించా. దీంతో ఒక అవగాహన వచ్చింది. ఉపాధ్యాయులు చెప్పిన ప్రణాళికను అనుసరించి చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. మా పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు మా సందేహాలను తరగతి గదిలో నివృత్తి చేస్తున్నారు.

– అనకాపల్లి భవానీ, ఆర్పీపేట, ఉన్నత పాఠశాల

నిర్దేశించిన సిలబస్ అనుసరిస్తూ..



పాఠశాలలో టీచర్లు చెప్పే అంశాలను అనుసరి స్తూ తరగతిలోనూ, ఇంటి దగ్గర పరీక్షలకు సిద్ధమవుతున్నాం. మాకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నా రు. పరీక్షల కోసం స్కూలు సిలబస్‌తో పాటు, స్టడీ మెటీరియల్, ఆల్ ఇన్ వన్‌కూడా అనుసరిస్తున్నాను.

– **సీహెచ్ జశ్వంత్**, ఆర్పీపేట ఉన్నత పాఠశాల

రివిజన్ చేస్తున్నా..



ప్రత్యేక తరగతుల్లో ఉదయం, సాయంత్రం గణితంలో సమస్యలను సూక్ష్మపద్ధతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు చెబుతున్నారు. టీచర్లు అన్ని సబ్జెక్టులు పూర్తి చేశారు. పట్టుదలగా రివిజన్ చేస్తున్నాను. ఇంట్లో అమ్మ పోషక విలువలున్న తేలికపాటి ఆహారం ఇస్తోంది.

– **గంట్యాడ మరియా,** కప్పరాడ ఉన్నత పాఠశాల

శతశాతం సాధిస్తాం..



పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు నిష్టాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. వారంతా కష్టపడి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించే విధంగా ప్రణాళిక రూపొందించాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నాం.

– **ఆర్ శ్రీనివాసరావు**, హెచ్‌ఎం, ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం

అన్ని మెటీరియల్స్‌తో బోధన..



టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన వారికి ఆయా సబ్జెక్ట్ టీచర్లతో అనుమానాలు నివృత్తి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో నిర్వహించే తరగతుల్లో పూర్తిస్థాయిలో హాజరు చూస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు అందించిన అన్ని మెటీరియల్స్‌తో బోధన చేస్తున్నాం.

– **విజయమాలిని** హెచ్‌ఎం, కప్పరాడ, ఉన్నత పాఠశాల ఐటీఐ జంక్షన్

జోరుగా కల్వర్టు పనులు



సంఘం ఆఫీస్ కూడలి వద్ద నిర్మిస్తున్న కల్వర్టు



శివరామ స్వీట్ షాప్ వద్ద నిర్మించిన కల్వర్టు

సీతంపేట : రోడ్డు విస్తరణలో భాగంగా అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా కల్వర్టు పనులు జోరుగా జరుగుతున్నాయి. విశాలమైన డ్రెయిన్లు నిర్మించి వాటిపై సిమెంట్ శ్లాబ్ వేసి ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. మెయిన్‌రోడ్డుకు అనుకుని ఇరువైపులా ఉన్న అనుబంధ రహదారుల నుంచి రాకపోకలు సాగించేందుకు వీలుగా డ్రెయిన్‌పై కల్వర్టులు నిర్మిస్తున్నారు. 26, 43 వార్డుల పరిధిలో డ్రెయిన్ కల్వర్టుల నిర్మాణం జోరుగా జరుగుతోంది. అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ కూడలి, జ్ఞాననికేతన్ స్కూల్ రోడ్డు, శివరామ స్వీట్ షాప్ పక్క రోడ్డు, జగన్నాథపురంలోని మూడు గుళ్లకు వెళ్లే రోడ్డులో రహదారుల వద్ద కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులతో సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెంలో బీఎస్‌ఆర్ ఫౌండేషన్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముఖ్య అతిథి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామారావు పాల్గొని శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు

ఎంవీపీకాలనీ: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకంలో భాగంగా వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు మంగళవారం పేర్లు నమోదు చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాలరిపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారి జె.మాధవి, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని 60 ఏళ్లు దాటిన వారి పేర్లు నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో, జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన వయోవృద్ధులకు కళ్లజోళ్లు, చెవి వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ఊతకర్రలు, చంక కర్రలు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్స్ వంటి ఉపకరణాలను ఉచితంగా అందిస్తామన్నారు. శిబిరం సమన్వయకర్త రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు

తాటిచెట్లపాలెం : రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్లు, ఎస్‌ఐల రిక్రూట్‌మెంట్ పేరిట వివిధ మాధ్యమాల్లో ప్రసారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని రైల్వే బోర్డు డీఐజీ శ్రీకామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీయూ ఎగ్జామ్‌నెట్ వెబ్‌సైట్‌లో ఆర్పీఎఫ్‌లో 4208 కానిస్టేబుళ్లు, 452 సబ్ ఇన్‌స్పెక్టర్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిలో ఎంతమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇటువంటి నోటిఫికేషన్ ఏదీ రైల్వే శాఖ జారీ చేయలేదని, ఎవరూ నమ్మొద్దని రైల్వే బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో సోమవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఏయూ హాస్టళ్లలోకి అనధికార వ్యక్తులు ప్రవేశించడం, వారి వద్ద అనుమానిత ప్యాకెట్ లభించిన నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి వర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో హాస్టల్ గదులను తనిఖీలు చేశారు. దాదాపు 30 మందికిపైగా పోలీసులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. అయితే వారి తనిఖీల్లో ఎటువంటి అనుమానిత వస్తువులు లభించలేదు. బయటి వ్యక్తులు కూడా లేరని పోలీసులు నిర్ధారించారు.

లలితా పీఠాధిపతికి పాదపూజ



లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట : అమృతోత్సవం పేరిట జరుగుతున్న లలితాపీఠం 75వ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామికి భక్తులు పాదపూజ చేశారు. ఆయన పాదుకలకు పుష్పార్చన చేసి పండితుల వేదమంత్రోచ్ఛరణ మధ్య పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో దర్బారు హాల్లో నిరీక్షించారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీస్వామిని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై అధిష్టింప జేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో చిల్డ్రన్ ప్లే ఏరియా



అక్కయ్యపాలెం గ్రీన్ బెల్ట్ ప్లే ఏరియాలో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



హైవేపై గ్రీన్‌బెల్ట్‌లో అభివృద్ధి చేస్తున్న వాకింగ్ ట్రాక్, ఫ్లవర్ గార్డెన్

సీతంపేట : స్మార్ట్ సిటీకి తగినట్టు నగరంలో పలు ప్రాంతాల అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే వారికి ఆహ్లాదం కలిగిస్తూ అక్కయ్యపాలెం జంక్షన్‌లో గల గ్రీన్‌బెల్ట్ బ్యూటిఫికేషన్ పనులతో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే అక్కయ్యపాలెం కూడలి వద్ద 60 అడుగుల వైఎస్సార్ సీపీ జెండా ప్రత్యేక సెల్ఫీ పాయింట్‌గా మారింది. అలాగే ప్రయాణికుల కోసం నిర్మించిన అక్కయ్యపాలెం(సౌత్) స్మార్ట్ బస్‌స్టాప్ ఈ ప్రాంతానికి కొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ బస్టాప్ వెనుక ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతానికి జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు చొరవతో బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి అందమైన మొక్కలు నాటారు. దీనికి తోడ్ సౌత్ బస్టాప్ వెనుక గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పిల్లలు ఆడుకోవడానికి రూ.19.90 లక్షలతో చిల్డ్రన్ ప్లే ఏరియా అభివృద్ధి చేస్తున్నారు. స్లైడర్స్, లేడర్స్ ఏర్పాటు చేశారు. అలాగే మరికొంత భాగంలో షటిల్ కోర్టు నిర్మిస్తున్నారు. గోడలపై అందమైన వాల్ ఆర్ట్స్ వేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్‌లో మరో చోట రూ.19.80 లక్షలతో వాకింగ్ ట్రాక్, మధ్యలో ఫ్లవర్ గార్డెన్, బుద్దా స్టాట్యూ ఏర్పాటు చెయ్యడానికి పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పూర్తయితే అక్కయ్యపాలెం హైవే ఏరియా కొత్త అందాలు సంతరించుకున్నట్టే.

బాలుర వసతి గృహానికి కొత్త రూపు

రూ.13 లక్షలతో మరమ్మతులు, వసతుల కల్పన



బాలుర వసతి గృహంలో గచ్చు చేస్తున్న దృశ్యం



వసతిగృహంలో నూతన మురుగుదొడ్లు

సీతమ్మధార : సీతమ్మధార టీపీటీ కాలనీలోని బాలుర వసతి గృహం రూపురేఖలు మారుతున్నాయి. ఇక్కడ మౌలిక సౌకర్యలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండడంతో ప్రభుత్వం రూ.13 లక్షలు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ హాస్టల్‌లో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడి 9 గదులకు పెయింటింగ్ వేసి ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఏడు మురుగుదొడ్లు కొత్తగా నిర్మించారు. పూర్తి స్థాయిలో సౌకర్యలు కల్పించడంతో ఈ వసతిగృహం రూపురేఖలు మారుతున్నాయి. మరోవైపు సీతమ్మధారలోని డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌లోని 9 గదుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇక్కడున్న డైనింగ్ హాలు, ఆఫీస్ రూం, వంట గదికి మరమ్మతులు చేపట్టారు. ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదువుతున్న 80 మంది విద్యార్థులు ఇక్కడ వుంటున్నారు. ఇక్కడ కూడా నూతనంగా మరుగుదొడ్లు నిర్మించి, పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారు.

సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునీకీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్‌ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు అనురాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు పాల్గొన్నారు.